జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మంగళవారం మధ్యాహ్నం తన ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ నూతన కమిషనర్ పి.సంపత్ కుమార్. విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం.

జీవీఎంసీ కమిషనర్‌కు మొల్లి హేమలత అభినందనలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్ కుమార్‌ను 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హేమలత 5వ వార్డులోని ముఖ్య సమస్యలను, కొండవాలు ప్రాంతాలలో మంచినీటి సదుపాయం కల్పించాలని, రాజీవ్ గృహకల్పలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, కుళాయిలు, వీధి దీపాల సమస్య, డంపింగ్ యార్డ్‌కు అతి దగ్గరగా ఉన్న వార్డ్ కావున తమ వార్డ్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందని వివరించారు. మౌళిక వసతుల కల్పనకు సహకరించి 5వ వార్డ్ అభివృద్ధికి తోడ్పడాలని హేమలత కోరారు.

వరిపొలాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - తగరపువలస: భీమిలి మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం గ్రామాలలో వరిపొలాలను వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్, భీమిలి మండల వ్యవసాయ అధికారి బి.శివకోమలిలు సందర్శించారు. నారు మడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 రోజుల కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి వేయాలని పేర్కొన్నారు. విత్తిన 7 నుండి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది కనుక మునిగిన నారు మడిలో నుండి నీరు 5 రోజుల లోపు పూర్తిగా బయటకు తీసి వేసిన తర్వాత, 5 సెంటుల నారుమడికి 1 కిలో యూరియా 1 కిలో పోటాష్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీకాంత్, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది స్వాతి, కృపామని పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: చినగదిలి పరిధిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం ఉదయం వివిధ పార్టీల ప్రతినిధులు, స్థానిక అధికారులతో కలిసి గోదాములను సందర్శించారు. అక్కడ పరిస్థితిని గమనించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. భద్రతా పరమైన చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అప్రమత్తంగా ఉండాలని అక్కడి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ లాగ్ బుక్‌లో సంతకం చేశారు. ఆయన వెంట వివిధ పార్టీల నేతలు, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎలక్షన్ సెల్ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఢిల్లీలో ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ టీం

విశాలాంధ్ర - పెందుర్తి: ఏపీలో టీడీపీ ప్రభుత్వం దాడులు చేస్తోందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేపట్టనున్న ఆందోళనలో పాల్గొనేందుకు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అధికార ప్రతినిధి అన్నంరెడ్డి అదీప్ రాజ్ బృందం ఢిల్లీ వెళ్లింది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమానికి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నాయకులు పైలా శ్రీనివాసరావు, పాలిశెట్టి సురేష్, మోపాడ అప్పారావు, రాజేష్, పల్ల అప్పారావు, ముడపాక శివ, మట్ట ప్రసాద్, చరణ్, నరేష్ తదితరులు బయలుదేరి వెళ్లారు.

జవహర్ నవోదయ పాఠశాలకు మరింత సహకారం అందిస్తాం

విశాలాంధ్ర - పీఎం పాలెం: జవహర్ నవోదయ విద్యాలయ కొమ్మాదిలో విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చంద్రకళ, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఈశ్వరి ప్రభాకర్, జిల్లా వైద్యశాఖ అధికారి, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాక ఇంజనీర్ ఫణికుమార్, తల్లిదండ్రుల ఉపాధ్యాయుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డా వై.ఎస్. చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలకు సంబంధించిన పలు విషయాలను వివరించారు. విద్యాలయంకు చెందిన విభిన్న ప్రతిభావంతురాలైన విద్యార్థిని తేజశ్వినిని ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్ లో స్వర్ణ పథకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పథకం గెలుపొందినందుకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరీంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా అభినం దించారు. ఇంకా మైగ్రేషన్ పథకం కింద మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం నుంచి వచ్చిన విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడిన తర్వాత విద్యాలయం పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యాలయకు అవసరమైన సహకారం అందిస్తానని కలెక్టర్ ఎం.ఎన్ హరీంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా హామీ ఇచ్చారు.

వీఎంఆర్డీఏ మెట్రోపోలిటన్ కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్డీఏ నూతన మెట్రోపోలిటన్ కమిషనర్‌గా కేఎస్ విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, కార్యదర్శి డి.కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజనీర్ ఎం.బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ రత్నకుమార్, పలువురు అధికారులు, సిబ్బంది మెట్రోపాలిటన్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ప్లానింగ్, అర్బన్ ఫారెస్ట్రీ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

బక్కన్నపాలెం హుధూద్ గృహ లబ్దిదారుల అవస్థలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు సంవత్సరాలు తరబడి కనీస అవసరాలైన త్రాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని హుధూద్ కాలనీ నివాసులు మండిపడ్డారు. నీరు, కరెంట్ సదుపాయాలు లేక అవస్థలు పడుతున్న బక్కన్నపాలెం హుధూద్ గృహాల లబ్ధిదారులు మంగళవారం జీవీఎంసీ జోన్ 2 మధురవాడ వద్ద ఆందోళన చేపట్టారు. బక్కన్న పాలెం హుధూద్ గృహ లబ్దిదారులు కాలనీలో నీరు, కరెంట్ సదుపాయాలు లేక నానా ఇబ్బ ందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తాగు నీరు, కరెంట్ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు నిరసన కార్య క్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ లబ్దిదారులు పాల్గొన్నారు.

హిజ్రాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తన ఔదర్యాన్ని చాటుకున్నారు. కుల మతాలకు అతీతంగా, ప్రాంతాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ కందుల నాగరాజు హిజ్రాలకు అండగా నిలిచారు. మంగళవారం ఆయన 34, 39వ వార్డులకు చెందిన భారతి, జ్యోతిక, బేబీ, మాధవి, విమల అనే హిజ్రాలకు నెల రోజులకు సరిపడా బియ్యం, కిరాణా సామానులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అవసరమైన తాను ముందు ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పేదలకు సేవ చేయడమే తన లక్ష్యమని మానవసేవే మాధవసేవ అని చెప్పారు. ఇటువంటి వారికి సేవ చేసే అదృష్టం రావడం సంతోషమని అన్నారు. దక్షిణ నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి అవసరం వచ్చిన తాను అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా హిజ్రాలు బిక్షాటన మాని కష్టపడి బ్రతుకుతాం, మాకు ఉపాధి చూపించండని వినతిపత్రం అందజేశారు. తన సేవా కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో వర, కుమారి, కోదండమ్మ, రాజు, కిషోర్, సరస్వతి, సంధ్య, పుష్ప, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో విభజన తెచ్చే కేంద్ర ప్రభుత్వ మెమోను వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ కేంద్రం జులై 9న జారీ చేసిన ఉత్తర్వులు ఉద్యోగుల్లో నిట్టనిలువునా చీలిక తెచ్చేదని తక్షణమే ఆ మెమోనూ కేంద్రం వెనక్కు తీసుకోవాలని విదసం నేత బూసి వెంకటరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహాత్మ గాంధీ హత్య అనంతరం మత ప్రాతిపదికన సమాజంలో విభజన వాదాన్ని వ్యాప్తి చేసే ఆర్ఎస్ఎస్ మత వాద పోకడల అడ్డుకట్ట కోసం 1966లో 3/10(ఎస్) మెమోను విడుదల చేసిందన్నారు. ఈ మెమో ద్వారా గత 60 ఏళ్ల ఉద్యోగుల్లో తారతమ్య మత విభేదాలు లేకుండా కలిసికట్టుగా జాతి అభివృద్ధి కోసం భారతీయ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ఈ నూతన మెమో వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ వారు, ఆర్ఎస్ఎస్ ఏతరులుగా ఉద్యోగుల్లో చీలిక వస్తుందని, ఉద్యోగుల్లో చీలిక ఉత్పాదకతపై పడి దేశ అభివృద్ధి కుంటుబడుతుందని, ప్రభుత్వ సేవలు పొందే ప్రజలలో కూడా ఆర్ఎస్ఎస్‌ను అంగీకరించని వారికి న్యాయం జరగదని ఇది ఉద్యోగులనే కాదు ప్రజల ఐక్యతను దెబ్బతీసే చర్య అని వెంకటరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం చర్యను విదసం ఐక్య వేదిక ఖండిస్తుందన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌ను కలసిన బెహర

విశాలాంధ్ర - గోపాలపట్నం: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను వైయస్ఆర్సీపీ మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

27న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జూలై 27వ తేదీన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి సభ్యులు, అహ్వానితులు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని జడ్పీ సీఈవో సూచించారు.

జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర ప్రజల ఆకాంక్షలకు, నగర అభివృద్ధికి అనుగుణంగా పనిచేస్తానని జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్ కుమార్ పాత్రికేయుల సమావేశంలో పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్లో నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కమిషనర్ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చాన్ని అందించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. విశాఖ నగరం ఎంతో సుందరమైనదని, ఇక్కడ ప్రజలు చాలా సౌమ్యులని, 25 లక్షల జనాభా కలిగిన మహా విశాఖ నగరానికి జీవీఎంసీ కమిషనర్‌గా నాకు మంచి అవకాశం వచ్చిందని, దీనిని నేను సద్వినియోగం చేసుకుంటానని, ఇక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకొని పని చేస్తానని తెలిపారు. స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విశాఖ నగరంలో పర్యటించానని, విశాఖలో సమస్యలపై అవగాహన ఉందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో విశాఖ నగరాన్ని మొదటి ర్యాంకులో నిలిచే విధంగా కృషి చేస్తానని తెలిపారు. విశాఖ సమస్యలు ఒక్కొక్కటి తెలుసుకొని వాటిని ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వా నికి నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అనేక ప్రాజెక్టులను ముందుగా తెలుసుకొని వాటిని పూర్తి చేసేలా కృషి చేస్తానని, విశాఖ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా, తనకున్న ఒకే ఒక లక్ష్యం - రెస్పాన్స్ సివిక్ బాడిగా విశాఖ నగర మార్పునకు 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులను పూర్తి చేస్తామన్నారు. ఉద్యోగులు, అధికారులను క్రమశిక్షణతో నడిపిస్తానని ప్రతి నెలలో రెండు, మూడు రోజులు ప్రత్యేకంగా (గ్రీవెన్స్) నిర్వహించి ఉద్యోగులకు సమయం కేటాయిస్తానని, వారి సమస్యలను వీలైనంత వరకు వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు. అంతేకాకుండా మీడియా ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతి సమస్యను, మీడియా యొక్క ఫీడ్ బ్యాక్‌ను తెలుసుకుంటానని, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు పూర్తి సమాచారం అందేలా చూస్తానని కమిషనర్ తెలిపారు. అనంతరం జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జివిఎంసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పత్రికా ప్రతినిధులు కమిషనర్‌ను కలసి పుష్ప గుచ్ఛాలను అందించారు.

జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనా కుమారి బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గిరిజన సహకార సంస్థ (జి.సి.సి.) నూతన ఉపాధ్యక్షులు మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనా కుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జి.సి.సి. అధికారులు, సిబ్బంది నూతన ఎండికి సాదరంగా స్వాగతం చెప్పి శుభాకాంక్షలు తెలియజేసారు. విధుల్లోకి చేరిన వెంటనే జి.సి.సి. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, సంస్థ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి, వివిధ అంశములపై సుదీర్ఘంగా చర్చించారు. అరకువ్యాలీ కాఫీ, మార్కెటింగ్, ఇతర అంశములపై ప్రస్తుతం నెలకొన్న సమస్యలపై పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, జీసీసీ ప్రధాన కార్యాలయం, క్షేత్ర స్థాయి సిబ్బంది అందరు నిబద్ధతతో పనిచేయాలని, తద్వారా సంస్థ పురోభివృద్ధికి, జీవనోపాధి కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. గిరిజనుల సమీక్షా సమావేశానంతరం, గిరిజన సహకార సంస్థలో విజిలెన్సు, ఫైనాన్సు మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్ రవాణా శాఖలను , హట్ అరబికా కాఫీ షాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్ లెట్ అమ్మకపు కేంద్రాలు తదితర విభాగాలను పరిశీలించారు. లా సన్స్ బే కాలనీలో జి.సి.సి. యొక్క ఖాళీ స్థలమును పరిశీలించి తదుపరి కార్యాచరణ కొరకు సూచనలు ఇచ్చారు. సంస్థ నూతన ఉపాధ్యక్షులు మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనా కుమారి బాధ్యతలు స్వీకరించడంతో సంస్థ సిబ్బంది హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. జీసీసీ జనరల్ మేనేజరు (పరిపాలన) జి.సంధ్యారాణి మీడియాకు ఈ వివరాలను ఒక ప్రకటనలో తెలిపారు.

వికలాంగుల కాలనీలో కూలీలపై జారిపడ్డ మట్టి పెల్లలు

తృటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - మధురవాడ: గ్రేటర్ విశాఖ మధురవాడ వికలాంగుల కాలనీ కొండవాలు ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులపై మట్టి పెల్లలు జారి పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల వర్షాలకు స్థానికంగా ఇండ్లు పరిసర ప్రాంతాలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతు కోసం ఇద్దరు యజమానులు నగరం నుండి రెండు బ్యాచ్‌లుగా కార్మికులను తీసుకొచ్చి విధులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాద సంఘటన చోటుచేసుకుంది. పోతిన శారద, బి.శ్రీనివాస్ ఇద్దరు ఇళ్ల యజమానులు తమ ఇళ్లు కూలిపోకుండా ఇంటి ముందు ప్రహరీ నిర్మించే క్రమంలో పిల్లర్ల కోసం గోతులు తీస్తున్న కూలీలపై ఒక్కసారిగా మట్టి పెల్లలు జారి పడటంతో జి.గణేష్, రెడ్డి అనే ఇద్దరు కూలీలు ఇరుక్కున్నారు. స్థానికులు సకాలంలో స్పందించి మట్టి పెల్లలు తొలగించి వారిని బయటికి తీయడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సిబ్బంది గాయాల పాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. స్థానిక 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు నమ్మి రమణ తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి బాధితులను పరామర్శించారు. మధురవాడ సర్వేనెంబర్ 27 కొండవాలు ప్రాంతం మొత్తం ఇటీవల వర్షాలకు చాలా ఇళ్లు దెబ్బతినడంతో స్థానిక ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు. దెబ్బతిన్న ఇళ్లకు ఆర్థిక సహాయం నిమిత్తం నిధులు విడుదల చేసి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కిల్కారి మొబైల్ అకాడమి సేవలపై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: గర్భిణీలు, బాలింతలలో అవగాహన కల్పించాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ జీవనరాణి తెలిపారు. కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణిగా వున్న నాల్గవ నెల నుంచి బిడ్డ పుట్టిన తరువాత ఏడాది వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనే దానిపై అవగాహన కల్పిస్తారని, ఇది పూర్తిగా ఉచితం అని, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఈ అకాడమీ పనిచేస్తుందన్నారు. ఏఎన్ఎం గర్భిణీలను నమోదు చేసినప్పుడు ఇచ్చే మొబైల్ నెంబర్‌కు ఎటువంటి చర్యలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు పుడతారు అనేది తెలియజేస్తారని చెప్పారు. కిల్కారి మొబైల్ అకాడమీ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి రాజు లంకపల్లి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు వారికి ఏమైనా అవగాహన కావాలంటే 01244451660, 14423 నెంబర్లుకు కాల్ చేయవచ్చని అయితే గర్భిణీగా ఏఎన్ఎం వద్ద నమోదు చేసుకున్న నంబర్‌తో చేయాలని తెలిపారు. అలాగే ఆశ కార్యకర్తలు కిల్కారి మొబైల్ అకాడమీ అందించే కోర్సును పూర్తి చేసి, పరీక్షలలో ఉత్తీర్ణత పొందాలని సూచించారు. విశాఖ జిల్లాలో 100 శాతం ఆశలు ఉత్తీర్ణత పొందారని తెలిపారు. అకాడమీ ప్రాంతీయ అధికారి మోహనరావు, డీపీహెచ్ఎన్ఓ మనోరమ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ ఎం.గంగు నాయుడు, షహనాజ్ సాధీయ, జిల్లా కమ్యూనిటీ మోబలైజర్ మణి కుమారి, సామాజిక ఆరోగ్య అధికారి పి సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, పార్వతమ్మ, ఎం ఎల్ హెచ్ పీ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖలో మరో దారుణం

గోప్యత పాటిస్తున్న పోలీసులు

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖలో ఓ యువతపై మరో దారుణం జరిగినట్లు తెలిసింది. విశాఖ నార్త్ సబ్ డివిజన్ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కొమ్మాది జంక్షన్‌లో ఉన్న ప్రైవేటు బేకరీలో పని చేస్తున్న యువతి తన ఉద్యోగం ముగించుకుని సోమవారం అర్థ రాత్రికి హాస్టల్ వెళుతుండగా కొందరు గుర్తుతెలియని వ్యక్తి యువతిపై దాడి చేసినట్లు సమాచారం. అర్ధరాత్రి 1 :00 గంటలకి యువతి తన నివాసం ఉంటున్న హాస్టల్ కి వెళ్లగా అక్కడ ఉన్న హాస్టల్ వార్డెన్ యువతి ఒంటిపై ఉన్న గాయాలను చూసి 112 కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించారు. వెంటనే పియం పాలెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అమ్మాయిని ఒక ప్రైవేట్ హాస్పిటల్ తరలించి వైద్యం చేయిస్తున్నట్లు తెలిసింది. అయితే ప్రస్తుతం అమ్మాయి ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారని ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసింది. ఈ ఘటనపై సీపీ సీరియస్ అయినట్లు సమాచారం. ఈ ఘటనపై వివరాలు గోప్యంగా పోలీసులు ఉంచడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి: సీపీఐ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం గ్రామ మండలిలో పశ్చిమ నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిహెచ్ మాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి కాంద్రేగుల సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధి ఏమీ చేపట్టలేదని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 60 రోజులు దాటినా ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వంలో అర్హులకు ఇళ్లు ఇస్తామన్నారని, ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైనా అర్హులైన వారిని గుర్తించి ఇళ్లు ఇవ్వాలన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వాలు తగ్గించలేదన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కామ్రేడ్ నూనెలు సూరిబాబు, పోతిన రాము, ఎన్‌వి త్రినాథ్, సత్యనారాయణ, రెడ్డి మధుసూదన్ రావు, కామేశ్వరరావు, డి.తిరుపతిరావు, ప్రకాష్ రెడ్డి, మహిళా సమైక్య నాయకురాలు గుడాల జయ, పార్వతి, పందిరి జయలక్ష్మి, పద్మ రమ తదితరులు పాల్గొన్నారు.

అమర్ అక్రమ లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖ: విస్సనపేటలో గుడివాడ అమర్ బృందం వేసిన అక్రమ లే అవుట్‌పై వీఎమ్మార్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాధన్‌కు జనసేన నేత పీతల మూర్తి యాదవ్ మంగళవారం ఆయన్ని కలిసి ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని విసన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 195/2లోని 609 ఎకరాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లే అవుట్ వేశారని తెలిపారు. అక్కడ ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా, సంబంధించిన ప్రభుత్వ శాఖలు నుండి ఎటువంటి అనుమతులు పొందకుండా గృహ (లే అవుట్) నిర్మాణం కోసం అక్కడ ఉన్న ప్రభుత్వ గెడ్డలను, సీలింగ్ భూములను, దళితుల అసైన్డ్ భూములను, కొండలు, ఇనాం భూములను, డి.పట్టా భూములను కలుపుకుని అక్రమ లే అవుట్ వేశారని చెప్పారు. అనకాపల్లి జిల్లా విసన్నపేటలో వైశాఖీ వ్యాలు పేరుతో భారీ అక్రమాలు జరిగాయన్నారు. వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, అతని అనుచరుడు బొడ్డేటి ప్రసాద్‌లు పర్యావరణానికి సైతం విఘాతం కలిగించారని తెలిపారు. 609 ఎకరాల భూమిలో అరుదైన జంతు జాతికి, నీటి వనరులకు నష్టం కలిగించారని తెలిపారు. లే అవుట్‌కి అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ బ్రోచర్లు వేశారుని, కనీసం రెరా అనుమతులు కూడా తీసుకోలేదని అన్నారు. వాల్టా చట్టాన్ని అతిక్రమించి చెట్లను కూల్చేశారని, సహజ వనరులను దోపిడీ చేశారని చెప్పారు. ఇప్పుడు విశాఖ వాసులకు అమ్మకానికి పెట్టారని చెప్పారు. అనుమతులు పొందకుండా వైశాఖి వ్యాలి పేరుతో బ్రోచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నా రన్నారు. అక్రమ వ్యాపారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమించిన ప్రభుత్వానికి సంబంధించిన అన్ని భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అక్కడ స్థలాలను కొన్న వినియోగదారులు నష్టపోతారని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ వ్యతిరేకించిన మత్స్యకార గ్రామస్తులు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సిఆర్‌జెడ్ పరిధిని విస్తరిస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు నక్కపల్లి మండలంలో నెల్లిపూడి, సిహెచ్ఎల్ పురం, పెదతీనార్ల గ్రామాలకు సీఆర్‌జెడ్ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ వ్యతిరేకిస్తూ మత్స్యకారులు, రైతులు, మండల నాయకులు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ వినతి పత్రం అందజేసారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ నెల్లిపూడి, పెదతీనార్ల, సిహెచ్ఎల్‌పురం రైతులు, మత్స్యకారులు మాట్లాడుతూ కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) మరింత విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తుందని, అయిదు కిలోమీటర్లకు పైగా సిఆర్‌జెడ్-11 స్థానంలో ప్రభుత్వం సిఆర్‌జెడ్-2019 అమలు చేసేందుకు నిర్ణయించిందని, సీఆర్‌జెడ్ పరిధిలో సముద్ర తీరానికి 500 మీటర్లలో వున్న ప్రాంతాలకు వర్తిస్తుందన్నారు. కాలుష్యం కలిగించే పరిశ్రమల మీద, భూగర్భ, ఇతర జలవనరుల మీద ప్రతికూల ప్రభావం తెచ్చే పరిశ్రమల మీద కఠినమైన నియంత్రణ ఉంటుందని మత్స్యకారులు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మేడేటి శంకర్‌లు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ స్థాయిలో నిర్వహించకుండా జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేయడంతో పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎపిఐఐసి భూములను కోల్పోయి పూర్తి స్థాయి నష్టపరిహారం అందించలేదని, ఇప్పటికే రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు కొత్తగా సిఆర్‌జెడ్ పరిధిని విస్తరించడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, మత్స్యకారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఇల్లు కట్టుకోవాలన్నా, బోరు వేయించుకోవలన్నా కేంద్రం అనుమతి తీసుకోవాలని, రైతులకు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని, మత్స్యకారులు ఉపాధి కోల్పోయి వీధిన పడతారన్నారు. ఆ ప్రాంతంలో మత్స్యకారులకు ఉపయోగపడే పరిశ్రమలు రావని, ఇప్పటికే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని 5000 ఎకరాల భూమిని సేకరించారన్నారు. మండలంలో సముద్రపు తీరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిహెచ్ఎల్‌పురం, నెల్లిపూడి, పెదతీనార్ల సిఆర్‌జెడ్ పరిధిలో చేర్చడం వల్ల ఆయా గ్రామాల్లో ప్రజలు భయాందోళ చెందుతున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా జిల్లా కేంద్రంలో ప్రజాభిప్రాయ సేకరణ చెయ్యడం తగదన్నారు. గ్రామ స్థాయి ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటు చేస్తే అందరు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం, అధికారులు ఆలోచించి ప్రజాభిప్రాయ సేకరణ గ్రామల్లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాల అధికారులకు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. అమరావతికి ఇదే ఆర్థిక సంవత్సరం రూ.15 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పడం శుభ పరిణామం అన్నారు. త్వరితగతిన పోలవరం నిర్మాణం, పారిశ్రా మిక ప్రగతి సాధిస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై మాట్లాడుతూ ఏ ముఖం పెట్టుకొని వెళుతున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర పరువు తీయవద్దని జగన్‌కు తెలుగు శక్తి హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, కూటమి కూటమి ప్రభుత్వానికి మంచి రోజులు వచ్చాయని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అని వ్యాఖ్యానించారు.

వార్డు అభివృద్ధికి సహకరించండి
- జీవీఎంసీ కమిషనర్‌కు అభినందనలు తెలిపిన కార్పొరేటర్ మూర్తి యాదవ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 22వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. తమ వార్డు అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా అభ్యర్థించారు. నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి బాటలో ముందు ఉంచాలని కోరారు.

రికార్డు స్థాయిలో సింహాచలం ఆర్టీసీ డిపో ఆదాయం

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఇటీవల జరిగిన గిరిప్రదక్షిణ, పౌర్ణమి రోజుల్లో రికార్డు స్థాయిలో సింహాచలం ఆర్టీసీ డిపోకు ఆదాయం లభించిందని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. 20వ తేదీన రూ.21 లక్షలు, 21వ తేదీన రూ. 19 లక్షలు ఆదాయం వచ్చిందని అన్నారు. సంస్థకు ఇంతటి ఆదాయాన్ని తీసుకొచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు అభినందనలు తెలిపారు. అసోషియేషన్ ప్రతినిధులు, సూపర్వైజర్లు, మెకానికల్, సెక్యూరిటీ, కార్యాలయ సిబ్బందికి డిపో మేనేజర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పారితోషకం అందజేశారు. సిహెచ్ లక్ష్మీ కండక్టర్ రూ. 500/-, సిహెచ్.సిఎం నాయుడు డ్రైవర్ రూ. 500/- ఇరువురు ఇ.పి.కె రూ. 136. 25, సత్యవతి కండక్టర్ రూ. 500/-, పి.టి.ఏ రావు రూ.500/- ఇరువురు ఇ.పి.కె 102.20, బి రమేష్ కండక్టర్ రూ . 500/-, కె.రమణ డ్రైవర్ రూ.300/- ఇరువురు ఇ.పి.కె 69.54 , టి.వి.జి.ఎస్ రావు కండక్టర్ రూ. 300/- ఇరువురు ఇ.పికె 124.24 , ఎం.ఎం రామ్ కండక్టర్ రూ. 300/- , జి.ఎం.రాజు డ్రైవర్ రూ.300/-, ఇపికె 98. 41, కె.ఎస్ బాబు కండక్టర్ రూ.300/-కు అందజేశారు.

గంజాయిని నిర్మూలించాలి

విశాలాంధ్ర - చీడికాడ: గంజాయి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న అన్నారు మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటన్న మాట్లాడుతూ గంజాయి మీద యుద్ధం పేరుతో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక ప్రకటించిందన్నారు. గత ప్రభుత్వం గంజాయిపై యుద్ధం ప్రకటించి ఏజెన్సీలో పెద్ద ఎత్తున గంజాయి తోటలు నరికి కుప్పలు వేసి తగలబెట్టి తరువాత ఆ విషయాన్ని విస్మరించిందన్నారు. నేటి ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికను పక్కాగా అమలు చేసి గంజాయి నిర్మూలనకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సమస్య సామాజిక సమస్య అని దీని మూలంగా అమాయక గిరిజనులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు గంజాయి వైపు ఎందుకు వెళ్తున్నారో కారణాలను విశ్లేషించాలన్నారు. గంజాయి పండిస్తున్న చోట ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించాలని వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో వ్యవసాయం హార్టికల్చర్ సెరికల్చర్ వంటి శాఖలన్నింటినీ అనుసంధానం చేయాలన్నారు. యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలని అయన కోరారు.

తన మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: తన డీలర్ నెట్‌వర్క్ ద్వారా మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించామని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రకటించింది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని భారతదేశం వ్యాప్తంగా నిర్వహిస్తుండగా, రాబోయే వర్షాకాల సీజన్‌లో కారు పూర్తిగా సంసిద్ధతను ఇది నిర్ధారిస్తుంది. బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ మిస్టర్ విక్రమ్ పవాహ్ మాట్లాడుతూ 'విశిష్ట వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు మా వినియోగదారుల వాహనాలు అత్యు త్తమ స్థితిలో ఉన్నాయని నిర్ధారించేందుకు బీఎండబ్ల్యూ గ్రూప్ కట్టుబడి ఉందన్నారు. మా మాన్‌సూన్ సర్వీస్ క్యాంపెయిన్ మినీ కార్లు భద్రతను, పనితీరును మెరుగు పరచడానికి క్షుణ్ణమైన ఇన్‌స్పెక్షన్‌లు, మెయింటెయినెన్స్ మరియు అవసరమైన అప్‌గ్రేడ్‌లను అందించేలా రూపొందించామన్నారు. మా వినియోగదారులకు విశ్వసనీయత, మనశ్శాంతిల ప్రాముఖ్యతను మేము అర్థం చేసుకున్నామన్నారు. ఈ క్యాపెయిన్ అసాధారణమైన సేవ, మద్దతును అందించడంలో మా అంకితభావాన్ని నొక్కి చెబుతుందన్నారు. శిక్షణ పొందిన టెక్నీషియన్లు, ప్రత్యేక వర్క్‌షాప్ టెక్నలాజీలు, ఒరిజినల్ పార్ట్స్‌తో కూడిన ప్రత్యేక బృందంతో, మీరు రిలాక్సింగ్‌గా ప్రయాణాలను ఆస్వాదించవచ్చని మేము నిర్ధారిస్తాము" అని తెలిపారు.

25 నుండి అమెజాన్ బ్యూటీలో ద బ్యూటీ సేల్

విశాలాంధ్ర - విశాఖపట్నం: బ్యూటీ కార్యక్రమంగా, లోరియల్ ప్రొఫెషనల్ లవ్ బ్యూటీ అండ్ ప్లానెట్‌తో కలిసి అమెజాన్ బ్యూటీ లోరియల్ పారిస్ సమర్పించిన 'ది బ్యూటీ సేల్' మళ్లీ వచ్చింది. జూలై 25 నుండి 29 వరకు అమలు చేయడానికి నిర్ణయించబడింది, ఈ షాపింగ్ కార్యక్రమం యొక్క నాల్గవ ఎడిషన్ ప్రముఖ బ్రాండ్‌ల ఎంపిక, ట్రెండింగ్ స్కిన్‌కేర్ పదార్థాలు, కొత్త ఉత్పత్తి విడుదలలు మరియు ప్రత్యేకమైన అన్వేషణలతో మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది, ఇవన్నీ అమేజాన్ వారి వేగవంతమైన డెలివరీ సౌలభ్యంతో గొప్ప విలువతో మరియు విశ్వసనీయ షాపింగ్ అనుభవంతో ఉంటాయి. లోరియల్ ప్రొఫెషనల్ మరియు లవ్ బ్యూటీ అండ్ ప్లానెట్‌తో కలిసి లోరియల్ పారిస్ సమర్పించిన 'ది బ్యూటీ సేల్' లోరియల్ పారిస్, లోరియల్ ప్రొఫెషనల్, లవ్ బ్యూటీ మరియు వంటి ప్రముఖ బ్యూటీ బ్రాండ్‌లపై, ప్లానెట్, మేబిలైన్, లాక్మే, షుగర్ కాస్మెటిక్స్, రూమ్ అండ్ అన్ని , కలర్ బార్, ఇన్నిస్ ఫ్రీ, సెరావే, జగువార్, ఫారెస్ట్ ఎసన్షియల్స్, కామా ఆయుర్వేద, 3 ప్లస్, ఆక్సిస్ - వై, ల్యాన్‌ఈజీవ్, టీపీ బ్యూటీ మరిన్నింటిపై 60 శాతం వరకు తగ్గింపును ఇస్తుంది.

మందు బాబులకు జరిమానా

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ మందుబాబులకు భీమిలి కోర్ట్ మంగళవారం జరిమానా విధించింది. పోలీస్ తనిఖీలలో పట్టుబడ్డ 27 మందిని భీమిలి కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టారు. ఈ మేరకు 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ జడ్జ్ డి.సౌజన్య ఒక్కొక్కరికి 10వేలు చొప్పున 27 మందికి 2లక్షల 70 వేలు రూపాయలు అపరాధ రుసుము విధించారు.

ఘనంగా బండారు జన్మదినోత్సవం

విశాలాంధ్ర - పరవాడ: టీడీపీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడి జన్మదిన వేడుకలు మంగళవారం మండలంలోని వెన్నలపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బండారు అప్పలనాయుడు తన జన్మదిన కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. బండారు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పండ్లు, స్వీట్లు పంచారు. వెన్నలపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి మెగా డ్యాన్స్ ధమాకా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైలా చిన అక్కునాయుడు, పైలా పైలా అప్పలనాయుడు, పైలా పైడం నాయుడు, పైలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వి.మాడుగుల: మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు జన్మ దినం పురస్కరించుకొని ఆయన స్వగ్రామం వెన్నెల పాలెం వెళ్లి సాలువతో సత్కరించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాడుగుల మండల జనసేన పార్టీ కార్యదర్శి దాసరి అచ్చుతరావు, ఆర్లి అంజిబాబు, కె.కోటపాడు మండల ప్రధాన కార్యదర్శి కుంచా అంజిబాబు, నాగులపల్లి మల్లు నాయుడు తదితరులు పాల్గన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో అక్రమ లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు ఎరిపల్లి కాసులు మంగళవారం జిల్లా రిజిస్టర్ అధికారికి ఫిర్యాదు చేశారు. పూడిమడక రెవెన్యూ పరిధిలోగల పలు సర్వే నెంబరు గల భూమిలలో అక్రమంగా లేఅవుట్లు వేసి, ఇల్లు స్థలాల పేరుతో ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు . వ్యవసాయ భూమిని చదును చేసి అక్రమ లేఅవుట్ వేసిన వారిపై , వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు . ఈ అక్రమ లేఅవుట్లులపై ఇదివరకే ఫిర్యాదు చేసి ఉన్నామని , అయినను ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని జిల్లా రిజిస్టర్ అధికారి వారికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

చంటిపిల్లల ఆధార్ నమోదు

విశాలాంధ్ర - యస్.రాయవరం: చంటి పిల్లలు ఆధార్ నమోదు చేసుకోవాలని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శక్తి ప్రియ సూచించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో సిఎస్‌సి కేంద్రం నిర్వాహకుడు దాడిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ మొదలు పెట్టారు. పుట్టిన చంటి పిల్లలు ఆధార్ నమోదు చేసుకొవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

విశాఖలో యూజీడీ ప్రాజెక్ట్‌పై మంత్రి నారాయణ సమీక్ష
యూజీడీ వ్యవస్థపై అసెంబ్లీలో ప్రశ్నించిన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగరంలో మురుగునీటి వ్యవస్థ తీవ్రంగా నగరాన్ని ముంచేస్తున్న నేపథ్యంలో నగర శివ ప్రాంతాల్లో యూజీడీ పనులు పూర్తికాకపోవడంతో, దక్షిణ నియోజకవర్గ ఓల్డ్ సిటీలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన యూజీడీ పైపులైన్లతో విశాఖ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో అసెంబ్లీలో విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రశ్నించడంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం సాయంత్రం సచివాలయంలో జీవీఎంసీ సి ఈ రవి కృష్ణ రాజు, ఎస్ఈ వినయ్ కుమార్ , కాంట్రాక్ట్ కంపెనీల ప్రతినిధులు యు జి డి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి ఫేజ్‌లో పెందుర్తి ఏరియాలో, రెండో ప్యాకేజీలో గాజువాక, మల్కాపురం ప్రాంతంలో యూజీడీ పనులు జరుగుతున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు రీసైక్లింగ్ వాటర్‌ను హెచ్ పీసీఎల్,స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. రూ.412 కోట్లతో 226 కిమీ మేర మొదటి ప్యాకేజీలో యూజీడీ నిర్మాణం చేపట్టిన టాటా ప్రాజెక్ట్స్ పనులు సాగుతున్నట్లు మంత్రికి తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరుకు మొదటి ప్యాకేజి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని అధికారులకు మంత్రి చెప్పారు. ఈ నెల 26న మరోసారి అధికారులు, కాంట్రాక్టు సంస్థలతో సమావేశం కావాలని నిర్ణయం చేశారు. వచ్చే వారం విశాఖలో పర్యటించి పనులు మంత్రి నారాయణ పనులు పరివేక్షణ చేపడతానని అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు మంత్రి తెలియజేశారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై మానవ సమాజం స్పందించాలి

రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ప్రత్యేక అవసరాల తరగతి వారిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మానవ సమాజం స్పందించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసారు. ప్రత్యేక తరగతుల వారికి రిజర్వేషన్ అవసరం లేదనడం, సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితిగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, ప్రత్యేక అవసరాల ప్రజలు సాధారణ వ్యక్తులు కన్నా నూటికి నూరు శాతం అన్ని రంగాలలో బాగా రాణిస్తారని పేర్కొన్నారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వివరణ కోరాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వివక్షకు గురవుతున్న ప్రత్యేక అవసరాల ప్రజలు ఇలాంటి కుహన మేధావుల మాటలు వలన ఇంకా క్షోభకు గురి అవుతున్నారని, ఇప్పుడున్న ఐఏఎస్ అధికారులు నడిచి వెళ్లి పని చేస్తున్నారా? అని ప్రశ్నించారు. సాంకేతికతను అందరికన్నా వారే బాగా అంది పుచ్చుకుంటున్నారని, ముంబయికి చెందిన కాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ అంగుటి వైద్య రంగంలో పద్మశ్రీ, పద్మభూషణ్ అందుకున్నారని వెల్లడించారు. 2014 ఆల్ ఇండియా ఐఏఎస్ లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఇరా సింగ్ హల్ ఢిల్లీలో నీతి అయ్యోగ్ లో చాలా బాగా పని చేస్తున్నారని, డాక్టర్ సత్యేందర్ సింగ్ మెడిసిన్ లో ఎంతో ప్రాదాన్యత చెందిన ప్రపంచంలోనే ప్రత్యేక అవసరాల వారికీ గుర్తింపు ఇచ్చే సర్టిఫికెట్ పొందారని తెలిపారు. జేసీకా కాక్స్ పైలెట్ గా రాణించారని, మాజీ ఐఏఎస్ అధికారిని బాలలత రక్షణ రంగంలో 15 సంవత్సరాలు పాటు పని చేసి ప్రస్తుతం దేశంలోని ఐఏఎస్ లకు కోచింగ్ ఇస్తున్నారన్నారు. రాజకీయాలకు సంబందించి జై పాల్ రెడ్డి ఎంతో ఉన్నత స్థానం అధిరోహించారని, మొన్నటికి మొన్న వారణాసిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒక ప్రత్యేక అవసరాల అధికారికి పాదాభివందనం చేసారని పేర్కొన్నారు. మనుషులకు ఫిజికల్ ఫిట్నెస్ ఒక్కటే ఉంటే సరిపోదు.. మెంటల్ ఫిట్నెస్ కూడ చాలా అవసరం అని వెంకటరావు వ్యాఖ్యానించారు. ఫ్యూడల్ బావాలతో ఆలోచించే వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ విషయమై మేధావులు,రాజకీయ నాయకులు,పత్రికాధినేతలు, సహా అన్ని వర్గాల వారు ప్రత్యేక అవసరాల వారికి బాసటగా నిలవాలని, భవిష్యత్తులో మరెవరు ఇలాంటి విమర్శలు చేయకుండా నిరోదించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసారు.

ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంలా
విశాఖ సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూలులో ఎన్నికల ప్రక్రియ

విశాలాంధ్ర - గాజువాక: సాధారణ ఎన్నికలలో నోటాతో సహా నూటికి నూరు శాతం పోలింగ్‌కై భారత ఎన్నికల కమిషనర్ నెలల తరబడి ఎంతగా పాటుపడుతున్నదో మనమందరం చూస్తున్నాం. ఈ నేపథ్యంలో విశాఖపట్నం గాజువాక బీహెచ్ఈఎల్ ప్రాంతంలోని సంసిద్ధ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులు పాటు ప్రజాస్వామ్యానికి నిలువటద్ధంలా విద్యార్థి సంఘ ఎన్నికలు జరిగాయి. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ స్థానంతో పాటు పాఠశాల కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్న విద్యార్థిని విద్యార్థులు రహస్య పద్ధతిలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలతగా ఆరో తరగతి విద్యార్థిని చి.వేదుల కృత్తిక (నిమ్మరాజు) తన ఓటు వేసి పోలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం జరిగింది. మరుసటి రోజు స్ట్రాంగ్ రూములను తెరిచి ఓట్ల లెక్కింపు జరిపించారు. ఈ ఎన్నికల్లో ఆర్.తనుష్ (హెడ్ బాయ్), రేవతీ శేషాద్రి (హెడ్ గర్ల్), హరి కీరత్ సింగ్ (డిప్యూటీ హెడ్ బాయ్), కావ్యా (డిప్యూటీ హెడ్ గర్ల్)గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ గవర్నింగ్ మాజీ సభ్యులు నిమ్మరాజు చలపతిరావు మాట్లాడుతూ విజేతలతో పాటు స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజాస్వామ్యం వరెడివిల్లాలంటే నూటికి నూరు శాతం ఎన్నికలు అవసరం అన్నారు.ఇందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థలలో ఇలాంటి ఎన్నికలు ఎంతో అవసర మన్నారు. ఈ సందర్భంలో స్కూలు ప్రిన్సిపల్ జి.భారతి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో మరో ప్రపంచం చూసేందుకు ఏ విధంగా ముందడుగు వేయాలో విద్యార్థి దశలోనే శిక్షణ ఇస్తున్నామని ఈ ప్రక్రియ పాఠశాల నిబద్ధతకు నిదర్శనంగా నిలువగలదన్నారు. యువ అభ్యాసకాలతో బాధ్యత పౌర కర్తవ్యాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు చాలా ముఖ్యమని తాము భావిస్తున్నామన్నారు. ఇలాంటి ప్రక్రియలలో తమ ఉపా ధ్యాయిని ఉపాధ్యాయులు వీరిలో అంకితభావంతో విద్యార్థులకు మార్గదర్శ కాలుగా నిలుస్తున్నారని భారతి అన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఆర్ఎస్ శెట్టి, కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ బలోపేతం

కోరమండల్ చైర్మన్ అరుణ్ అలగప్పన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలోపేతం చేస్తుందని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ అన్నారు. "వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మిగిలి పోయినందున, భరోసాపై కేంద్ర బడ్జెట్‌లోని ప్రాధాన్యతను మేము స్వాగతిస్తున్నామన్నారు. ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అలాగే వ్యవసాయంలో స్థితిస్థాపకత మరియు ఉత్పాదకతను నిర్మించడం. ఉత్పాదకతను మెరుగుపరచడం వాతావరణాన్ని తట్టుకునే పంటలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించడానికి వ్యవసాయ పరిశోధన సెటప్ యొక్క ప్రతిపాదిత సమగ్ర సమీక్ష భారతీయ వ్యవసాయం వాతావరణ ప్రభావాన్ని తట్టుకోగలదని నిర్ధారించడానికి ఒక ప్రేరణనిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ రంగానికి చెందిన నిపుణులను ఒకచోట చేర్చే చొరవ వ్యవసాయ రంగంలో ఆర్ అండ్ కి ఉందన్నారు. కోటి మంది రైతులను సేంద్రీయ వ్యవసాయంలోకి తీసుకురావడానికి రాబోయే రెండేళ్లలో పెద్ద ఎత్తున ఉద్యానవన ఉత్పత్తిని ప్రోత్సహించాలనే ప్రభుత్వ నిబద్ధత వ్యవసాయ ఉత్పాదకత మరియు స్థిరత్వాన్ని గణనీయంగా పెంచుతుందన్నారు.. ప్రతిపాదిత 10,000 అవసరాల ఆధారిత బయో-ఇన్‌పుట్ వనరుల కేంద్రాల ఏర్పాటు సహజ వ్యవసాయాన్ని భారతీయ రైతులకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడుతుందన్నారు. ఇంకా, పప్పుధాన్యాల ఉత్పత్తి, నిల్వ మరియు మార్కెటింగ్‌ను బలోపేతం చేయడం, రొయ్యల పెంపకానికి ఆర్థిక సహాయం చేయడంతోపాటు, విభిన్న వ్యవసాయ కార్యకలాపాలకు మద్దతునిచ్చే సమగ్ర విధానాన్ని ప్రదర్శిస్తుందన్నారు. వ్యవసాయం అనుబంధ రంగాల కోసం రూ. 1.52 లక్షల కోట్ల కేటాయింపులు ఈ కీలక రంగాన్ని మార్చేందుకు ప్రభుత్వ అంకితభావానికి స్పష్టమైన సూచన అని చెప్పారు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా మహారాజా అర్బన్ బ్యాంక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను, ది ఆదర్శ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుతో విలీనం చేసి, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా ఆవిష్కరించేందుకు సభ్యుల ఆమోదం పొందినట్లు బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు, చైర్మన్ యం.రామకృష్ణంరాజు తెలిపారు. మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 24వ మహాజన సభ మంగళవారం క్షత్రియ కళ్యాణ మండపం, సీతమ్మధారలో జరిగింది. ఈ సందర్భంగా యం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.265.96 కోట్లు డిపాజిట్లు, రూ.177.33 కోట్ల ఋణములు ఇచ్చి, రూ.443.29 కోట్లు వ్యాపారం కలిగి ఉన్నామని తెలియజేసారు. ఈ ఆర్థిక సంవత్సరములో రూ.4.02 కోట్ల రూపాయలు స్థూల ఆదాయంను ఆర్జించగా రూ.1.02 కోట్ల రూపాయలు ఆదాయపు పన్ను చెల్లించి, రూ.3.00 కోట్లు నికర ఆదాయం ఆర్జించామన్నారు. మార్చి 31, 2025 నాటికి రూ.475 కోట్లు వ్యాపారం చేయటానికి లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఈ సభకు కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతి రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కృష్ణ ప్రసాద్, ఎన్ఏఎఫ్‌సియుబి చైర్మన్, తెలంగాణా స్టేట్ కో-ఆప్ అర్బన్ బ్యాంక్స్ ఫెడరేషన్ అధ్యక్షులు జి.మదన గోపాల స్వామి, పూర్వ పి.ఎఫ్. కమీషనర్ యస్.వి.యస్.యస్. రామ చంద్ర రాజు, మహారాజా బ్యాంక్ జనరల్ మేనేజర్ యన్.యన్.సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

భూమాత రియల్ ఎస్టేట్ సంస్థకు క్వాలిటీ, రియాలిటీలో అవార్డు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భూమాత గ్రూప్ సౌత్ ఇండియాలో నెంబర్ వన్ రియల్ ఎస్టేట్ సంస్థగా భూమాత గ్రూప్ అవార్డు దక్కింది. క్వాలిటీ, రియల్టీ అందించటంలో నెంబర్ వన్ స్థానాన్ని సొంతం చేసుకున్న భూమాత గ్రూప్ బిజినెస్ టైటాన్స్ 2024 ఆధ్వర్యంలో అవార్డు ప్రధానం చేశారు. ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ చేతులమీదుగా భూమాత గ్రూప్ అధినేత తాళ్లూరి పూర్ణచంద్రరావు అవార్డు అందుకున్నారు. అబుదాబి లో భూమాత గ్రూప్ కి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో నెంబర్ వన్ సంస్థగా అవతరించిన భూమాత రియల్ ఎస్టేట్ సంస్థ ఖాతాదారులు నమ్మకంతో అగ్రగామిగా నిలిచింది. ఈ సందర్భంగా సంస్థ అధినేత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ విజయం సాధించడంలో సంస్థ ఉద్యోగుల కీలకపాత్ర పోషించారని ఆనందం వ్యక్తం చేశారు. సరైన సమయంలో నాణ్యతతో కూడిన నిర్మాణాలు వినియోగదారులకు అందించడంలో మన్ననలు పొందామని, తెలుగు రాష్ట్రాల్లో ఖాతాదారుల్లో రియల్ ఎస్టేట్ రంగంలో మొదట ప్రాధాన్యత భూమాత సంస్థకే ఇస్తున్నారని, ఇదే ఆదరణ భవిష్యత్తులో దక్కాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.